## అర్జీల పరిష్కారానికి కృషిచేయాలి

ఐటిడిఎ పిఒ



ప్రజాపక్షం/భద్రాచలం : గిరిజన దర్బారులో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బారుకు హాజరైన ఆయన వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం వాటిని పరిశీలించి వివిధ శాఖల అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన గిరిజనులకుప్రభుత్వ పథకాలు అందించేందుకు నిరంతర కృషి సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో.. జాగిలాల పాత్ర కీలకం: సిపి



ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : నేరపరిశోధనలో పోలీసు జాగిలాల పాత్ర కీలకమని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అన్నారు. హైదరాబాద్ ఐఐటీఏ మొయినాబాద్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొంది ఖమ్మం పోలీసు కమిషనరేట్‌కు కేటాయించిన పింకీ, రోక్సీ అనే రెండు పోలీసు జాగిలాలతో పాటు డాగ్ హ్యాండ్లర్లు బి.రవి, టి.అచ్యుత్, కె.గౌతమ్‌కుమార్ సోమవారం ఖమ్మం సిపి కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ హత్యలు, దోపిడిలు, దొంగతనాలు జరిగిన సమయంలో నిందితులను పట్టించడం, సంఘవిద్రోహులు అమర్చే పేలుడు పదార్థలను గుర్తించడంలో జాగిలాల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఫలితంగా ప్రాణ, ఆస్థినష్టం సంభవించకుండా నివారించడంలో ఇవి పోలీసులకు సహకరిస్తాయన్నారు. స్థానిక పెరడ్‌గ్రౌండ్స్‌లో వీటి కోసం ప్రత్యేకంగా అన్నివసతులతో ఏర్పాటు చేసిన గదులలో వీటిని ఉంచనున్నట్లు తెలిపారు. ఈ జాగిలాలలో ఒకటి బెల్జియం బ్రాండ్‌కు చెందిన నార్కోటిక్ పనిగట్టే డాగ్ పింకి, మరోకటి లాబ్రడార్ రిట్రీవర్ బ్రాండ్‌కు చెందిన పేలుడు పదార్థాలు గుర్తించే డాగ్ రోక్సీ ఉన్నాయని సిపి వివరించారు.

## సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : ఎర్రుపాలెం మండలం మామునూరు గ్రామంలో ఉపాధిహామీ పథకం నిధుల నుండి మంజూరైన రూ.6లక్షలతో నిర్మించనున్న నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల్లో అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క కృషితో పెద్ద మొత్తంలో జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ మారాబత్తుల ఆదిలక్ష్మీ, వార్డు సభ్యులు గంగారపు ఆంజనేయులు, వారికూటి రవి, బేతు శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు కామసాని శ్రీనివాస్‌రెడ్డి, గంతాల శ్రీనివాసరావు, దంతాల లక్ష్మణరావు, దోమందుల వీరయ్య, స్వామి, షేక్.కరీం తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి: డిఎస్‌పి



ప్రజాపక్షం/మణుగూరుః ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనదారుడు ఎలిమెంట్ ధరించి విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని డిఎస్‌పి రవీందర్ రెడ్డి కోరారు. ఇంటి నుండి బయలుదేరిన వెంటనే హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, డ్యూటీ కి వెళ్లే సమయంలో, డ్యూటీ నుండి తిరిగి వస్తున్న సమయంలో కార్మికులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని డిఎస్పి రవీందర్ రెడ్డి సూచించారు.

## రాష్ట్రస్థాయి క్రీడల్లో జిల్లా పోలీసుల ప్రతిభ



ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : హైదరాబాద్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి క్రీడపోటీల్లో ఖమ్మం జిల్లా పోలీసులు ప్రతిభచాటారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక సిపి కార్యాలయంలో జరిగిన అభినందన సభలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరిగిన వివిధ పోటీల్లో ఖమ్మం పోలీసు కానిస్టేబుల్స్,ఇతర అధికారులు పాల్గొని అద్భుతమైన ప్రతిభ కనబరిచి 15 బంగారు పతకాలు 8 రజిత, 16 కాంస్య మొత్తం 39 పతకాలు కైవసం చేసుకుని జిల్లా పోలీసుశాఖ కీర్తిని మరింత పెంచారని అన్నారు. ఇదే స్ఫూర్తితో జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి ఖమ్మం ఖ్యాతిని నలుదిక్కులా చాటాలని ఆకాంక్షించారు. ఇందుకు ముమ్మర సాధన అవసరమన్నారు. క్రీడల్లో రాణించే వారికి మరింత ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు (ఎఆర్) కుమారస్వామి, విజయబాబు, ఎఆర్ ఎసిపి సుశీల్‌సింగ్, నర్సయ్య, ఆర్ఐలు సురేష్, సాంబశివరావు, క్లూస్‌టీం ఇన్‌స్పెక్టర్ నరేష్ పాల్గొన్నారు.

# ప్రతీ పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు

నిరుపేద ఆడబిడ్డలకు ప్రభుత్వం భరోసా

అభివృద్ధి సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, పేద వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం భారీ ఎత్తున సంక్షేమ ఫలాలు పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కొత్తగూడెం టౌన్, చుంచుపల్లి, లక్ష్మీ దేవిపల్లి, సుజాతనగర్ మండలాలకు చెందిన 168 మంది లబ్ధిదారులకు రూ.1.68 కోట్ల విలువైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఆడ బిడ్డల పెళ్లిళ్లు భారం కాకుండా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గ పరిధిలో ఒకే దఫాలో 307 మందికి కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు మంజూరు కావడం హర్షణీయం అని అన్నారు. అనంతరం అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న 72 మంది బాధితులకు రూ.30.75 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కూడా అందజేశారు. ప్రజాపక్షం వహించే నాయకునిగా, నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి ప్రభుత్వం సహాయం అందే వరకు నిరంతరం కృషి చేయనున్నట్లు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన తొలి ప్రాధాన్యత అని, అర్హులైన ప్రతీ ఒక్కరికి న్యాయం జరిగేలా పారదర్శకంగా పథకాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, డిప్యూటి మేయర్ లలిత కుమారి, తహశిల్దార్లు పుల్లయ్య, కృష్ణప్రసాద్, నాగరాజు, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/పాల్వంచ : గుడిపాడు వెంకటేశ్వర స్వామి ఆలయ భక్తులు, ప్రజల సౌకర్యార్థం రహదారి సౌకర్యాన్ని కల్పించనున్నట్లు కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. ఆ ఆలయాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, ఆలయ నిర్మాణ ధాత నల్లా సురేష్ రెడ్డితో కలిసి సందర్శించిన ఆయన పరిసరాలను పరిశీలించారు. కాకతీయుల కాలం నాటి ఈ దేవాలయానికి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు ఎన్ సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో రూ.2 కోట్లతో జరిగిన ఆలయ పునఃప్రతిష్ట పనులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.దేవాదాయ ధర్మాదాయ శాఖ సహకారంతో రూ.2 కోట్ల నిధులతో దేవాలయం పునః ప్రతిష్ట మహోత్సవాలను నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అడుమిల్లి సాయిబాబా, వీశంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లుతో పాటు ఇఒ ఎన్ రజనీ కుమారి, నాయకులు గౌతమి కృష్ణ, వాడే లక్ష్మీ ,శనగారపు శ్రీనివాస్, వల్లపు యాకయ్య, ఆరెం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఏదులాపురం ఘటనను వక్రీకరించవద్దు

సిపిఐ రూరల్ మండల సమితి

ప్రజాపక్షం/ ఖమ్మం : ఏదులాపురం గ్రామంలో ఈనెల 20న జరిగిన ఓ చిన్న ఘటనను వక్రీకరించి అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని, ఈ వక్రీకరణలు మానుకుంటే మంచిదని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రూరల్ మండల సమితి తెలిపింది. సోమవారం ఈ మేరకు సిపిఐ రూరల్ మండల సమితి ఒక ప్రకటన విడుదల చేసింది. ఏదులాపురం సిపిఐ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ ఒప్పంద ఉద్యోగులు, లబ్ధిదారులు ఉన్న సందర్భంలో ఏదులాపురం మాజీ సర్పంచ్ చెరుకుపల్లి భాస్కర్ అక్కడకు వెళ్లి అందరిని ఇక్కడకు ఎందుకు రప్పించారు లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి ధృవపత్రాలు పరిశీలించవచ్చు కదా అని సూచించడం జరిగిందని ఆ ప్రకటనలో తెలిపారు. అంతే తప్ప ఒప్పంద ఉద్యోగి పట్ల చెరుకుపల్లి భాస్కర్ అసభ్యంగా, దురుసుగా మాట్లాడలేదని అన్నారు. అధికార పార్టీ నాయకులు కొందరు వాస్తవంగా చూపి జరిగిన ఘటనను వక్రీకరించి తప్పుడు కేసు పెట్టించారని, అధికార పార్టీ బాధ్యులు ఈ విషయంపై పునః పరిశీలన చేయాలని సూచించింది. ఈ ఘటనపై బహిరంగ విచారణకు సిపిఐ సిద్ధంగా ఉందని తెలిపింది. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జోక్యం చేసుకుని అక్రమ కేసులను నివారించాలని తెలిపింది. పోలీస్ అధికారులు సైతం నిష్పక్షపాత విచారణ జరిపి ఏమి జరిగిందో తెలుసుకోవాలని సిపిఐ మండల సమితి కోరింది. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, నాయకులు సిద్దినేని కర్ణకుమార్, మిడికంటి వెంకటరెడ్డి, ఉన్నం రంగారావు, వెంపటి వెంకటసురేందర్ ఉన్నారు.


# మహిళా సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

ప్రజాపక్షం/పాల్వంచ : తమ అక్రమాలకు, ఆగడాలకు అడ్డుతగులుతున్నదని ఓ మహిళా సర్పంచ్‌పై గ్రామ పంచాయితీ కార్యదర్శి వేధింపులను తట్టుకోలేక సర్పంచ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం పాల్వంచ మండలవ్యాప్తంగా కలకలం సృష్టిస్తున్నది. సర్పంచ్ తెలిపిన ప్రకారం మండల పరిధి సత్యనారాయణపురం ( మొండికట్ట ) గ్రామ పంచాయితీ సర్పంచ్ జర్పుల సరితను గత మూడు నాలుగు వారాలుగా పంచాయతీకార్యదర్శి వేధింపులకు గురి చేస్తున్నారని చెప్పారు. రెండు సంవత్సరాలుగా పంచాయితీలో పాలక వర్గం లేకపోవటంతో కార్యదర్శి ఇష్టారీతిగా పాలనను కొనసాగించారు. పంచాయితీ లెక్కలు అడిగేవారు ఎవరూ లేరు. దీనితో పలువురి వద్ద నుండి వృద్ధాప్య, వితంతు పింఛన్‌లు ఇప్పస్తామంటూ చేతివాటానికి సైతం దిగినట్లు ఆరోపించారు. రెండు సంవత్సరాలైనా పింఛన్‌లు రాకపోవటంతో బాదితులు సర్పంచ్‌కు మొరపెట్టుకొన్నారు. తన బండారం బైట పడటంతో నా పట్ల ఉద్ధేశ్యపూర్వకంగా వేధింపులకు దిగిన కార్యదర్శి ఉపాధి హామీ పనుల్లో సైతం లబ్ధిదారులను ఎంపిక చేయాలని సర్పంచ్‌పై ఒత్తిడి తెచ్చి ప్రజల మధ్య వివాదాలకు ఆజ్యంపోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సర్పంచ్ అని చూడకుండా ఎప్పుడూ ఎదో ఒక సాకుతో ఇబ్బందులకు గురిచేస్తున్నడన్నారు. మీకు బదులుగా మీ భర్త ఎందుకు మాట్లాడుతున్నారని, ఇలా అయితే వార్డు మెంబర్లతో సంతకం చేయించి నన్ను పదవి నుండి తొలగిస్తానంటూ పలు పకాలుగా వేధనకు పాల్పడతున్నారని వాపోయింది. అనంతరం సర్పంచ్ భర్త మాట్లాడుతూ.. మా అమాయకత్వాన్నిఆసరా చేసుకొన్న గ్రామ కార్యదర్శి ఉద్ధేశ్యపూర్వకంగా సర్పంచ్‌ను తన మాటలతో పలు విధాలుగా వేధింపులకు పాల్పడుతున్నాడని దీనితోనే సర్పంచ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. గ్రామస్థుల నుండి పింఛన్ ఇపిస్తామంటూ తీసుకొన్న ఘటనలో వాయిస్ రికార్డులు ఉన్నాయని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి పంచాయితీ కార్యదర్శిపై తగు విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



# కల్యాణలక్ష్మీ , సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాయం



ప్రజాపక్షం/ఆళ్లపల్లి : ఆళ్లపల్లి మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని కల్యాణలక్ష్మీ, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా కల్యాణలక్ష్మీ పథకం కింద 24 మంది లబ్ధిదారులకు మొత్తం 24,02,784 రూపాయల చెక్కులను పంపిణీ చేసి, పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించారు. అదనంగా ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆరుగురు లబ్ధిదారులకు 1,70,000 రూపాయల ఆర్థిక సహాయం అందజేసి, అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా సామాజిక భద్రత, ఆర్థిక స్థిరత్వం పెరుగుతుందని వివరించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర వరప్రసాద్, ఎంపిడిఒ డి శ్రీనివాస్, ఎఇ హైసింగ్ శ్రావణ్, డాక్టర్ సంఘమిత్ర, మండల అధ్యక్షులు, సర్పంచ్ పాయం రామ నరసయ్య, ఆళ్లపల్లి సర్పంచ్ వాసం సుస్మిత, అనంతోగు సర్పంచ్ కల్తీ వెంకటేశ్వర్లు, నడిగూడెం సర్పంచ్ సత్య కుమారి, బోడయికుంట సర్పంచ్ ఏడుల శ్రావణి, మార్కోడు సర్పంచ్ సుతారి రామాదేవి, రాయపాడు సర్పంచ్ ఊకే చిన్న పాపయ్య, వాసం శ్రీకాంత్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు





ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : మార్చి 14 నుండి జరిగే పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఐడిఒసిలో సోమవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 73 సెంటర్లలో 12731 మంది రెగ్యులర్, 404 మంది ప్రైవేటు అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారని చెప్పారు. ప్రతీ రోజు ఉ.9.30 గం. నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పరీక్షల కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ప్రయాణానికి అనువైన వాతావరణం కల్పించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163బి ని అమలు చేయాలని పోలీసులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని, విద్యార్థులు ఒత్తిడి గురికాకుండా పరీక్షలు రాసే వాతావరణాన్ని కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యాధికారి నాగలక్ష్మీ తో పాటు శంఖు ప్రసాద్, మాధవరావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ



ప్రజాపక్షం/వైరా : వైరా మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మీ, శ్యామ్‌బాబు దంపతుల ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, వికలాంగుడికి వీల్‌చైర్‌ను వైరా మున్సిపల్ చైర్ పర్సన్ కాపా చంద్రకళ, డాక్టర్ కాపా మురళీకృష్ణ దంపతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, రెడ్డి, వాంకుడోత్ బీక్యా, గుగులోతు లక్ష్మీ బాయి, షేక్ రహీం( పండు), తేజావత్ నాగేశ్వరరావు, గడసందుల దర్గయ్య, కొర్రా వెంకటేశ్వర్లు, బానోతు కృష్ణ బాబు, తేజావత్, బాలమ్మ, వాంకుడోతు మని, భూక్యా లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# విస్తరిస్తున్న సంచార వ్యాపారం



ప్రజాపక్షం/ ఖమ్మం : సంచారమే ఎంతో బాగున్నది. దానంత ఆనందమేమున్నది ఇల్లు పొల్లు లేని, మూల్లే మూట లేని ... అంటూ సంచార జీవితంపై గోరెటి వెంకన్న అద్భుతమైన పాట వ్రాశారు. సంచార జీవితంలో ఉన్న వెసులుబాటును వివరించారు. సంచార జీవితం సంగతేమో కానీ సంచార వ్యాపారం నలు దిశల విస్తరిస్తుంది. అద్దె లేని ప్రచారం అవసరం లేని తళుకు బెళుకు లేని వ్యాపారం సంచార వ్యాపారం ఇప్పుడు పలువురిని ఆకర్షిస్తుంది. ఆహార పదార్థాల మొదలు ఖరీదైన వస్తువులను సైతం రోడ్లపైనే విక్రయిస్తున్నారు. మొబైల్ వ్యాపారం ఇప్పుడు అన్ని రంగాలకు విస్తరించింది. ముఖ్యంగా నగరాలు, పట్టణాలలో రోడ్లపై మొబైల్ వ్యాన్లతో టిఫిన్, టీ సెంటర్లు మధ్యాహ్న పూట భోజనాలను ఏర్పాటు చేస్తున్నారు. హోటళ్లలో కంటే మొబైల్ క్యాంటీన్ల వద్ద చౌకగా దొరుకుతుండడంతో వినియోగదారులు మొబైల్ వ్యాపారుల వద్ద కొనుగోళ్లు జరుపుతున్నారు. ఉదయం పూట మొబైల్ టిఫిన్ సెంటర్ల వద్ద క్యూ కడుతున్నారు. ఖరీదైన హోటళ్లతో పాటు రుచి ఉండటం, కండ్ల ముందే తయారు కావడం, ధర చౌకగా ఉండటం కూడా మొబైల్ క్యాంటీన్ల సంఖ్య పెరగడానికి కారణమవుతుంది. ఇంటి వద్ద తయారు చేసుకుని వచ్చి భోజనాలు రోడ్ల వెంట పెట్టి విక్రయించే వారి సంఖ్య పెరుగుతుంది. కేవలం ఆహార పదార్థాలే కాదు బంగారం, వెండి మొదలైన అతి ఖరీదైనవి తప్ప మిగిలిన వాటిలో చాలా వరకు మొబైల్ వ్యాన్ల ద్వారా విక్రయిస్తున్నారు. ఒకప్పుడు తోపుడుబండ్ల వ్యా పారమంటూ హేళన చేసిన చోటే ఇప్పుడు మొబైల్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. మొబైల్ వ్యాపారం ఇప్పుడు అన్ని రంగాలకు విస్తరించడంతో పాటు లాభాలను తెచ్చిపెడుతుందన్న భరోసా కలుగుతుంది. ముఖ్యంగా అద్దెలు, విద్యుత్ బిల్లులు ఉండవు. వ్యాపార అనుమతులు అవసరం లేదు. వ్యాపారాన్ని బట్టి కనీస ఏర్పాట్లు చేసుకుంటే సరిపోతుంది. పనిచేసే వారి సంఖ్య అంతగా అవసరం లేదు. అదనపు ఖర్చులు లేకపోవడంతో వినియోగదారులు ఆవైపు మొగ్గు చూపుతున్నారు. సంచార ఆసుపత్రులు, రక్త పరీక్ష కేంద్రాలు కూడా గ్రామ గ్రామాన తిరుగుతున్నాయి. నిత్యావసర వస్తువులు, కూరగాయలు కూడా ఇంటి ముంగిటకే వస్తున్నాయి. మొత్తంగా సంచార వ్యాపారం జోరుగా సాగుతుంది. భవిష్యత్తులో వ్యాపారం ఎన్ని కొత్త పుంతలు తొక్కనుందో.

# ‘పెద్ద రైతు దారి కోసం బక్క రైతు బలి’



ప్రజాపక్షం/ ఖమ్మం : ఓ పెద్ద రైతు దారి కోసం బోనకల్ రెవెన్యూ అధికారులు ఓ బక్క రైతును బలి ఇచ్చారు. రెవెన్యూ అధికారుల దెబ్బకు తనకున్న కాస్త భూమిని ఆ రైతు కోల్పోయాడు. రెవెన్యూ అధికారులకు మాత్రం కాస్త దండిగానే దక్కినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఇందులో విద్యుత్ అధికారుల పాత్రపై కూడా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ రైతు నుంచి ప్రభుత్వం సేకరించిన భూమిలో 16 అడుగుల దారి వదిలి సబ్ స్టేషన్ నిర్మాణానికి డిజైన్ చేయాల్సిన అవసరం ఏమిటన్న ప్రశ్న వినవస్తుంది. విద్యుత్ అధికారులను సైతం ప్రలోభాలకు గురి చేశారన్న సందేహం కలుగుతుంది. వివరాల్లోకి వెళితే... రాష్ట్ర ప్రభుత్వం బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంజూరు చేసింది. స్థల అన్వేషణకు బయలుదేరిన రెవెన్యూ అధికారులను కొందరు ప్రలోభాలకు గురిచేసి నిరుపేద రైతు మందడపు నారాయణ భూమిని కేటాయించేలా చేశారు. స్థల కేటాయింపుకు సంబంధించి గ్రామసభ నిర్వహించడం కానీ, స్థల పంచనామ విషయం కానీ సదరు రైతుకు తెలియదు. మందడపు నారాయణకు సర్వేనెం. 116లో 35 కుంటల భూమి ఉంది. ఇది అనేక దశాబ్దాల నుంచి వారసత్వంగా వస్తుంది. ఈ భూమి ప్రధాన రహదారికి అనుకుని ఉంది. గతంలో నారాయణ భూమి నుంచి దిగువన ఉన్న రైతులు దారి అడిగారు. ఈ విషయమై ఒకట్రెండు సార్లు పంచాయతీలు కూడా జరిగాయి. దారి ఇవ్వడం కుదరదని నారాయణ తేల్చి చెప్పడంతో దొడ్డి దారిన దారి పొందేందుకు సబ్ స్టేషన్‌కు నారాయణ భూమి కేటాయించేలా రెవెన్యూ అధికారులను ఒప్పించారు. ఒక రైతు భూమి కోసం కేవలం 35 కుంటల భూమి కలిగి చేతి వృత్తిపై జీవించే నారాయణ భూమిని కేటాయించారు. కనీసం నారాయణకు సమాచారం ఇవ్వలేదు. గ్రామంలో చాటింపు వేయలేదు. పంచనామ సమయంలోనూ భూ యజమాని నారాయణకు సమాచారం ఇవ్వలేదు. పైగా 2013 వరకు నారాయణ పేరుతో అసైన్డ్ పట్టా ఉన్న దానిని ఇప్పుడు ప్రభుత్వ భూమిగా చూపుతున్నారు. అసైన్డ్ భూమి నుంచి ప్రభుత్వ భూమిగా ఎలా మారిందన్న ప్రశ్నకు బోనకల్ రెవెన్యూ అధికారులు సమాధానం చెప్పడం లేదు. మొత్తం భూమిని సేకరించి సబ్ స్టేషన్ నిర్మాణం జరిగే సందర్భంలో 16 అడుగుల స్థలాన్ని ఎందుకు వదిలేశారని ప్రశ్నిస్తే అందుకు విద్యుత్ అధికారులు సమాధానం చెప్పడం లేదు. విద్యుత్ అధికారులు, రెవెన్యూ అధికారులు కలగలిసి రైతు నారాయణను దెబ్బతీశారని కేవలం పెద్ద రైతు ప్రలోభానికి లొంగి ఈ పని చేశారని నారాయణ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. సోమవారం సబ్ స్టేషన్‌కు కేటాయించిన స్థలంలో బోరు వేశారు. అది కూడా 16 అడుగులు వదిలి బోరు వేయడం మరిన్ని అనుమానాలకు తావిస్తుంది. పెద్ద మొత్తంలో నగదు చేతులు మారబట్టే విద్యుత్, రెవెన్యూ అధికారులు ఇటువంటి పనికి శ్రీకారం చుట్టారని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. గ్రామసభలో తీర్మానం, పంచనామ పత్రాల నకలును నాకు అందజేయాలని 15 రోజులుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతుంటే స్థానిక తహసీల్దార్ కలెక్టరేట్‌లో ఉందని, గిర్దావర్ యుడిసి వద్ద ఉందని, యుడిసి గిర్దావర్ వద్ద ఉందని తిప్పుతున్నారు తప్ప నకలు ఇవ్వడం లేదు. గతంలో ఇదే రైతు నారాయణ పహాణి నకలు కోసం దరఖాస్తు చేస్తే నెలల తరబడి తిప్పుకుని చివరకు కనీసం సమాధానం కూడా చెప్పలేదు. కేవలం నారాయణ విషయంలోనే కాదు బోనకల్ మండలంలో రైతులందరి విషయంలో రెవెన్యూ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓ రైతును ఇదే రెవెన్యూ అధికారులు పెద్ద మొత్తంలో ఓ పని చేసేందుకు నగదు డిమాండ్ చేయడంతో ఆ రైతు ఎసిబి అధికారులను ఆశ్రయించినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకుని ఓ అధికారి సెలవుపై వెళ్లినట్లు కూడా ఆరోపణలు వినవస్తున్నాయి. మొత్తంగా రెవెన్యూ సదస్సుల పేరుతోనూ పెద్ద మొత్తంలోనే వసూలు చేసినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. బోనకల్ రెవెన్యూ అధికారుల అక్రమ వ్యవహారాలపై విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. భూ సేకరణ, దారి కేటాయింపుపై విచారణ జరిపి న్యాయం చేయాలని రైతు నారాయణ కోరుతున్నాడు.



## మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్‌కు ఘన సన్మానం

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** 2వ మున్సిపల్ సాధారణ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్‌ను జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువతో ఘనంగా సన్మానించారు. ఎన్నికలు విజయవంతంగా చేసినందుకు గాను కమీషనర్‌ను అభినందించారు. తోటి ఉద్యోగులు కూడా అభినందనలు తెలిపారు.



## పొన్నారంలో రూ.10లక్షలతో సిసి రోడ్డు పనుల ప్రారంభం

**ప్రజాపక్షం/మందమర్రి :** మండలంలోని పొన్నారం గ్రామంలో పది లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఉప సర్పంచ్ పెంచాల అమృత ఈ పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ దశలవారీగా అన్ని వీధుల్లో రోడ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. ఈ సిసి రోడ్డు అందుబాటులోకి వస్తే వర్షాకాలంలో ప్రజలకు ఎదురయ్యే బురద సమస్య తప్పుతుందని తెలిపారు. ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించి పొన్నారాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎఇ ఇషాక్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ కలెక్టరేట్ :** రానున్న గోదావరి నది పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం సాయంత్రం రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ గోదావరి నది పుష్కరాల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, రాబోయే గోదావరి నది పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. ఇదివరకే సంబంధిత అధికారులు అందరితో పుష్కరాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించినట్లు వివరించారు. ఈ విసిలో డిపిఒ శ్రీనివాస్, నీటిపారుదల ఇఇ అనిల్, జెడ్పీ సిఇవో గోవింద్, ఇఇ ఆర్ డబ్ల్యుఎస్ సందీప్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కుమ్మర జాతరలో దాడికి గురైన బాధిత రజక, దళిత కుటుంబాలపై దాడి చేసిన అగ్రకుల పెత్తందారులపై హత్య కేసు నమోదు చేసి తక్షణం అరెస్ట్ చేయాలని సిపిఐ జిలత్లా కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. నాగర్ కర్నూలు జిల్లా కుమ్మర జాతరలో రజకులు, దళిత కుటుంబాల మహిళలపై దాడి చేయడమే కాకుండా చంటి పిల్లను హత్య చేసిన భూస్వామ్య దొరలు శ్రీనివాసరెడ్డి, మధురెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సతీష్‌రెడ్డి ఇతర గుండాలపై తక్షణం విచారణ నిర్వహించి వారిని అరెస్ట్ చేయాలన్నారు. నలుగురు అగ్రకుల భూస్వాములు దళిత, రజక కుటుంబాలను గుడిలోకి రానీయకుండా అడ్డుపడటం సిగ్గుచేటన్నారు.



## ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యసోదరునికి ప్రభుత్వ ఉద్యోగం

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటూ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నిలబెట్టుకుంటుందని జిల్లా కలెక్టర్ అన్నారు. సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య తమ్మునికి నిజామాబాద్ ఎక్సైజ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ నియామకపు పత్రాన్ని అందించారు. గతనెల జనవరి 23న విధినిర్వహణలో ఉండగా వెహికల్ చెకింగ్ చేస్తున్న క్రమంలో దుండగులు కారుతో ఢీకొనడంతో ప్రమాదానికి గురైన గాజుల సౌమ్య తొమ్మిదిరోజుల పాటు హైదరాబాద్ నిమ్స్‌తో మృత్యువుతో పోరాడి జనవరి 31న మృతి చెందింది. తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా సౌమ్య అంత్యక్రియలకు హాజరై, సౌమ్య కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రకటించారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 6న సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెక్కును కీర్తిశేషులు గాజుల సౌమ్య కుటుంబానికి అందించడమే కాకుండా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామన్న ప్రభుత్వ హామీని నిలబెట్టుకుంటు సోమవారం ఫిబ్రవరి 23న నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చేతుల మీదుగా గాజుల సౌమ్య తమ్ముడు గాజుల శ్రావణ్‌కు ఎక్సైజ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇచ్చిన హామీని నెలరోజుల్లో నెరవేర్చడమే కాకుండా సౌమ్య కుటుంబానికి అన్ని విధాలుగా ప్రభుత్వం చేదోడుగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, నోడల్ డిపి ఇవో మల్లారెడ్డి, సిఐ స్వప్న, ఎస్ఐ మల్లేశ్, చంద్రమోహన్, రవి, తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి కోసం సిపిఐ ధర్నా

సమస్య పరిష్కరించకుంటే మళ్లీ నిరాహార దీక్షలు

ముడుపు ప్రభాకర్ రెడ్డి



**ప్రజాపక్షం/ఆదిలాబాద్/నిర్మల్ :** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని 12వ వార్డు 170 కాలనీలో నెలకొన్న తీవ్ర మంచినీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద భారీ నిరసన చేపట్టారు. జిల్లా కలెక్టర్ నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి నాయకత్వంలో బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు.

ఈ సందర్భంగా స్పందించిన ఆదిలాబాద్ ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్ వి.రాజు సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. గత ఏడాది 170 కాలనీలో ఐదు లక్షల రూపాయల వ్యయంతో మంచినీటి బోరు వేయించి,పైప్‌లైన్, నీటి ట్యాంకులు ఏర్పాటు చేసినప్పటికీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో ఆ సంపద నిరుపయోగంగా మారిందని ప్రభాకరరెడ్డి మండిపడ్డారు. విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించి వెంటనే కనెక్షన్ ఇవ్వాలని, గతంలోనే కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించినప్పటికీ నేటికీ ఆ ఫైలు పెండింగ్‌లో ఉండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

దీనివల్ల కాలనీలోని సుమారు 200 కుటుంబాలు గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనే ఈ సమస్యపై రెడు నెలలపాటు నిరాహార దీక్షలు చేపట్టగా, అప్పట్లో సీతక్క హామీతో శ్రీనివాస్‌రెడ్డి వచ్చి దీక్షను విరమింపజేశారని, కానీ నేటికీ హామీ నెరవేరలేదని గుర్తుచేశారు. అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ కనెక్షన్ ఇప్పించి నీటి సరఫరా పునరుద్ధరించాలని, లేనిపక్షంలో మళ్లీ నిరాహార దీక్షలకు దిగుతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటల రాములు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కామ్లేల రాందాస్, కడప సురేష్, ఆదిలాబాద్ మండల నాయకులు సాగర్, కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## అక్షరాస్యత, జ్ఞానంతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

జిల్లా విద్యాధికారి యాదయ్య

**ప్రజాపక్షం/మంచిర్యాల :** ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో పునాది అక్షరాస్యత, సంఖ్యా జ్ఞానం (ఎఫ్ఎల్ఎన్) పెంపొందించడం ద్వారానే వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు పడతాయని జిల్లా విద్యాధికారి యాదయ్య తెలిపారు. జిల్లాలోని ఎంపిక చేసిన 53 పాఠశాలల్లో ఈనెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించబోయే ఎఫ్ఎల్ఎన్ సర్వేను విజయవంతం చేయాలని ఆయన సూచించారు. మంచిర్యాల జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్ఆర్‌కెఎం డైట్ కళాశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదవడం, రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలతోపాటు కనీస గణిత ప్రక్రియలపై అవగాహన కల్పించడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. ఏవైనా సందేహాలు ఉంటే ఈ శిక్షణ కాలంలోనే నివృత్తి చేసుకోవాలని, తద్వారా క్షేత్రస్థాయిలో సర్వేను పారదర్శకంగా పూర్తి చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, రిసోర్స్ పర్సన్లు బుచ్చన్న, వామన్ కుమార్, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

## తిర్యాణిలో ఆక్రమణలపై విచారణ

ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ శాఖ ఆదేశం

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/తిర్యాణి :** తిర్యాణి మండలంలో ప్రభుత్వ భూములు, ప్రజా భవనాల ఆక్రమణలపై ప్రజాపక్షం దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను కొందరు వ్యక్తులు అక్రమంగా కబ్జా చేస్తున్నారన్న వార్తపై ప్రాథమిక వివరాలు సేకరించడం ప్రారంభించారు. వివాదాస్పద ప్రాంతాల్లో తక్షణమే సర్వే నిర్వహించి, వాస్తవ పరిస్థితులపై పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా, ఆ భూములను తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చిన ప్రజాపక్షం కథనంతో రెవెన్యూ యంత్రాంగం కదలడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తదుపరి చర్యల కోసం తిర్యాణి ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ కె. హరిత



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందిన దరఖాస్తులను అధికారులు సమన్వయంతో త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం.డెవిడ్, ఆసిఫాబాద్ ఆర్డిఒ లోకేశ్వర రావుతో కలిసి ఆమె అర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని, అధికారులు తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో ఆసిఫాబాద్‌కు చెందిన బోయని నాగేష్ తన తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం కోసం, జైనూర్ మండలం పార గ్రామానికి చెందిన సిడ్మారావు వ్యవసాయ చేనులో బోరు మంజూరు కోసం విన్నవించారు. రెబ్బెన మండలానికి చెందిన ఎల్కరి పద్మ, ఉమారాణి, ఆత్మకూరి రజిత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకోగా, కౌటాల మండలం తాటినగర్ వాసి శరత్ చంద్ర బుద్ధ మందిరం పేరిట అక్రమ చందాల వసూలుపై చర్యలు తీసుకోవాలని కోరారు. చింతల మానేపల్లికి చెందిన ఓ రైతు తన భూమిని ఇతరులు పట్టా చేసుకున్నారని ఫిర్యాదు చేయగా, జన్కాపూర్ గ్రామానికి చెందిన అనసూయ తనకు నర్సింగ్ కాలేజీలో అవుట్ సోర్సింగ్ కింద ఉపాధి కల్పించాలని కలెక్టరును వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు చేరువగా ప్రజావాణి కార్యక్రమం

కలెక్టర్ రాహుల్ రాజ్

నిజాంపేట్ మండల కేంద్రంలో దరఖాస్తులు స్వీకరణ



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** ప్రజల దూర భారాన్ని, ప్రజల సమయాన్ని తగ్గించడం కోసమే మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం నిజాంపేట్ మండలంలో ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ, మండల కేంద్రాల్లో ప్రజావాణిని మరింత బలోపేతం చేస్తామని, ప్రజలదూర భారాన్ని, ప్రయాణ బత్యాల్ని, సమయాభావాన్ని తగ్గించడం కోసమే ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిజాంపేట ప్రజావాణిలో ప్రజల నుండి వివిధ సమస్యలపై మొత్తం 42 దరఖాస్తుల స్వీకరించినట్లు తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అన్ని సమస్యలు పరిష్కరించి, పరిష్కారం కాని వాటిని రాతపూర్వకంగా ఫిర్యాదుదారులకు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. భూ సమస్యలన్నీ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కోర్టు పరిధిలో, పోలీసు పరిధిలో ఉన్న వాటిని సంబంధిత శాఖలకు పంపించాలన్నారు. వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ చేసి, వారం రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలు జిల్లా కార్యాలయాల చుట్టూ తిరవలసిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే వారి సమస్యలకు పరిష్కారం దొరికేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. నేటి నిజాంపేట్ ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్య అధికంగా ఉన్నందువల్ల వాటిని పరిష్కరిస్తామని పరిష్కరించని వాటిని రాతపూర్వక సమాధానం అందిస్తారని పేర్కొన్నారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో ఉన్న అధికారులందరూ అది తూచా తప్పకుండా ప్రజావాణి కార్యక్రమంలో హాజరవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ రాజారెడ్డి, మండల స్థాయి అధికారులు, రెవిన్యూ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.




## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉపాదిహామీ కింద మంజూరు అయిన రూ.30లక్షల నిధులతో గ్రామంలోని వివిధ కాలనీలలో సిసి రోడ్లు వేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా రెండు పాఠశాలల ప్రహరీగోడ నిర్మాణ పనులకు నిధులు మంజూరు అయ్యాయని, ఎస్సీ కాలనీలో అండర్‌గ్రౌండ్ నిర్మాణ పనులకు నిధులు మంజూరు అయ్యాయని, వాటికి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, నవాబ్‌పేట సర్పంచ్ అశోక్‌రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంత్‌రెడ్డి, భిక్షపతిరెడ్డి, కుంట లక్ష్మ ణ్, నర్సింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి


ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి

కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆమె స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్‌కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ విద్యాసంస్థలు, వసతి గృహాలు తనిఖీ చేస్తూ ఉండాలని తెలిపారు. వేసవి కాలం సమీపిస్తున్నందుకు విద్యార్థులకు నీటి సమస్యలు తలెత్తకుండా తగు ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలల మౌలిక సదుపాయాల కల్పన పనులు, మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణాలు, అంగన్వాడి భవన నిర్మాణ పనులు, మండల ప్రత్యేక అధికరులు పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకల్యాణి, జెడ్పీ సిఇఒ శంకర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/బైంసా :** బైంసా మండలంలోని సిద్దూర్, టాక్లి, లింగా గ్రామలలో మహిళా సమాఖ్య సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ని నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, విద్యా రంగం, మహిళా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు,మండల నాయకులు, ప్రజాప్రతతినిధులు, అధికారులు,గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పదవ తరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ పి.ప్రావీణ్య



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** జిల్లాలలో జరగనున్న పదవ తరగతి వార్షిక పరీక్షలను ఎలాంటి లోటుపాటు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి పరీక్షల నిర్వహణపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 14 నుండి ఏప్రిల్ 15 వరకు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 24,657 మంది విద్యార్థులు ఎస్ఎస్‌సి పరీక్షలకు హాజరు కానున్నారని వీరి కోసం 123 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందుగానే చేరుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేసి తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని స్పష్టం చేశారు. ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీటి వసతి పరిశుభ్రమైన వాతావరణం నిరంతరం, విద్యుత్ సరఫరా, ప్రథమ చికిత్స, సదుపాయం తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షలు పూర్తయ్యేవరకు ప్రతి కేంద్రంలో ఫుల్ టైమ్ స్కావెంజర్‌ను నియమించి మరుగుదొడ్లు, శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు రవాణా పరంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్ష సమయాలకు అనుగుణంగా బస్సులు నడపాలని ఆర్‌టిసి అధికారులకుసూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ఇంటర్మీడియల్ విద్యాధికారి గోవిందు రామ్, డిఎం అండ్ హెచ్ఒ డా.వసంత్‌రావు, పోలీస్ ఆర్టీసీ పోస్టల్, విద్యుత్ ట్రాన్స్‌పోర్ట్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళా సంఘం భవనానికి శంకుస్థాపన

ఎమ్మెల్యే సునీత

**ప్రజాపక్షం/హత్నూర :** హత్నూర మండలంలోని మహిళా సంఘం భవనానికి సోమవారం ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అందుకు గాను ప్రభుత్వం మహిళలకు వడ్డీలేని ఋణాలు ఇస్తుందన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నల్లోల్ల ఎల్లయ్య, మాజీ ఎంపిపి వావిలాల నర్సింలు ,వైస్ ఎంపిపి పండుగ రవికుమార్, బిఆర్ఎస్ నాయకులు శివ శంకర్ రావు ,ఉపసర్పంచ్ చెక్క మానస, రవీందర్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ మెరాజ్, మాజీ పిఎసి ఎస్ డైరెక్టర్ గుండా రాములు, మండల పార్టీ అద్యక్షుడు రామచంద్రారెడ్డి నిరుడు యాదగిరి మహంకాళి ఖాజా ఖేఖర్, పల్లి దుర్గేశ్వర ,మన్నె యాదగిరి, మల్లేశం, ప్రభు కృష్ణ,బాబు, పాల్గొన్నారు.

## ఇస్నాపూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా మాధవి ఎన్నిక



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ఇస్నాపూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన పట్లోల మాధవి, నరేందర్‌రెడ్డి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆమెకు హృదయపూర్వక అభినందనలు తెలియజేసి భవిష్యత్తులో ఇస్నాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో ఆరోగ్యం, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రఘు శంకర్, రాము, వెంకటేష్, రవీందర్‌రెడ్డి ,అజ్జుబాయి, పాల్గొన్నారు.

